న్యాయవాదులపై దాడులను అరికట్టాలి



న్యాయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

లాలాపేట: న్యాయవాదులపై భౌతిక దాడులను అరికట్టేలా ప్రొటెక్షన్ యాక్టు కింద చర్యలు తీసుకోవాలనీ పలువురు న్యాయవాదులు కోరారు. ఈ మేరకు న్యాయ కార్యదర్శి రేండ్ల తిరుపతిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు రూ 5 వేల స్టైఫండ్ మంజూరు, యువ న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటుగా హెల్త్ కార్డులో మహిళా న్యాయవాదులకు ప్రసూతి ప్రయోజనాలు జోడించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎల్ శ్రీనివాసులు గౌడ్, ముడుపు శశికాంత్, కుషీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



యాంటీ లార్వా మందు పిచికారీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

సనత్‌నగర్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి అన్నారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఎంటమాలజీ సిబ్బందితో కలిసి బేగంపేటలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంటీ లార్వా మందును పిచికారీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డి పార్కు సందర్శన



కొండారెడ్డి పార్కును సందర్శిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అడ్డగుట్ట: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు తుకారాం గేట్ కొండారెడ్డి పార్కును శుక్రవారం సందర్శించారు. ఎన్నికల ప్రచారం సమయంలో స్థానిక వాసులు పార్కును అభివృద్ధి చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అభివృద్ధి విషయాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గాజుల హంసరాజ్ జీహెచ్ఎంసీ డీసీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఏఈ వేణు పార్కును పరిశీలించారు. పార్కు అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల వివరాలు సేకరించారు. ఏఈ వేణు, సూపర్‌వైజర్ సలీం, నాయకుడు గాజుల హంసరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించాలి



వస్త్ర ప్రదర్శనలో మోడల్ సుధాజైన్

లాలాపేట: చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు అందరూ వారంలో ఒకరోజు తప్పకుండా చేనేత వస్త్రాలను ధరించాలని ప్రముఖ మోడల్ సుధాజైన్ కోరారు. తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్త కళా ప్రదర్శనను శుక్రవారం సందర్శించారు. చేనేత వస్త్రాలు, పట్టు చీరెలను పరిశీలించి తయారీదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్త కళాకారులు ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి సరైనా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు వికాస్ జైన్, వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది చేనేత కళాకారులు పాల్గొన్నారు.

సందడిగా గోరింటాకు వేడుక



గోరింటాకు చేతులను చూపిస్తున్న మహిళలు

సనత్‌నగర్: ఆషాఢ మాసం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 'గోరింట పూసింది' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు పెరుమాళ్ల నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సనత్‌నగర్, ఎస్ఆర్‌టీకాలనీ, జెక్‌కాలనీ, సుందర్‌నగర్, ఉదయ్ నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోరింటాకు దంచి అరచేతులకు పెట్టుకున్నారు. మహిళా నేతలు శ్రీదేవి, నిర్మల, చంద్రకళ, శ్రీలత, వాణి పాల్గొన్నారు.

అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

కాచిగూడ: అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) ఏ గ్రేడ్ గుర్తింపు అభించిందని ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్ రావు వెల్లడించారు. శుక్రవారం బర్కత్‌పురలోని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ కళాశాలల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంకతో కలిసి మాట్లాడారు. 1992లో కళాశాల ఆవిర్భావించిందని, గతంలో ఈ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ ఉండేదని ఈ యేడు న్యాక్ ఏ గ్రేడ్ లభించిందన్నారు. విద్యార్థులకు సిలబస్‌తో పాటు ఇతర కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నామని దీనిని న్యాక్ పరిగణలోకి తీసుకుందన్నారు. విద్యార్థులకు డేటా సైన్స్, డేటా ఎన్‌లోట్రిక్, సైన్స్ సెక్యూరిటీ కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నామన్నారు. అంతర్జాతీయ కళాశాలలో ఎంఓయు ఒప్పందం కూడా చేసుకున్నామని రీసెర్చ్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

కబంధ హస్తాల్లో కమ్యూనిటీ హాళ్లు..!

- సామాన్యుల సౌకర్యార్థం నిర్మించిన జీహెచ్ఎంసీ
- ఆయా కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహణ
- నిర్దిష్ట ధర లేక కొన్నిచోట్ల ఇష్టానుసారంగా వసూళ్లు
- కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా వ్యవహారం
- అద్దె డబ్బుల వసూళ్లకు కనిపించని జవాబుదారీ
- అధికారులు పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు



సనత్‌నగర్‌లోని ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్

సనత్‌నగర్: కమ్యూనిటీ హాళ్ల నిర్వహణపై జీహెచ్ఎంసీ అధికారుల అజమాయిషీ లేకపోవడంతో కొన్ని కాలనీ అసోసియేషన్ల వారు ఆడిందే ఆట.. పాడిందే పాట..అన్నట్లుగా మారింది. ఇష్టానుసారంగా వసూళ్ల పర్వానికి దిగుతుండడంతో వాటి అసలు లక్ష్యం నీరుగారిపోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులు తక్కువ ఖర్చుతో ఫంక్షన్స్ నిర్వహించుకునేలా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దాదాపుగా కాలనీకో కమ్యూనిటీ హాళ్లను నిర్మించారు. వాటి నిర్వహణను ఆయా కాలనీల అసోసియేషన్లే చూసుకుంటున్నాయి. అయితే కొందరు ప్రతినిధులు ఎవరిష్టానుసారం వారు అద్దెలకు ఇస్తున్నారు. మెయింటెనెన్స్ కింద నామమాత్రపు రుసుం వసూలు చేస్తే ఫర్వాలేదు. అలా కాకుండా పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తూ సామాన్యుడి కమ్యూనిటీ హాళ్లను కాస్తా బడాబాబులకు మాత్రమే అన్నట్లుగా మార్చేస్తున్నారు.

అద్దెల వసూళ్లలోనూ వ్యత్యాసం..

సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట డివిజన్లలో ఏ కమ్యూనిటీ హాల్‌కు నిర్దిష్టమైన అద్దెను నిర్ణయించలేదు. దీంతో సామాన్యులకు ఓ రేటు, అదే ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నత స్థాయిలో ఉన్న వారితో ఫోన్ చేయిస్తే మాత్రం మరో రేటు చెబుతున్నారని, ఎందుకీ ఈ వ్యత్యాసం ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇటీవల సనత్‌నగర్ డివిజన్‌లో కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కు సమీపంలోని ఓ కమ్యూనిటీ హాల్‌లో ఓ చిన్న ఉద్యోగి ఫంక్షన్ చేసుకునేందుకు కాలనీ ప్రతినిధులను సంప్రదిస్తే ఏకంగా రూ.15 వేలు అద్దె చెప్పడం గమనార్హం. తగ్గించాలని విజ్ఞప్తి చేసినా వినలేదు. చివరకు వారి పరిస్థితిని అర్థం చేసుకున్న ఓ ఎమ్మెల్యే పీఏ ఫోన్ చేస్తే గానీ దిగిరాలేదు. ఇంచుమించు అన్ని కమ్యూనిటీ హాళ్లలోనూ ఇదే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు.

వ్యాపార కార్యకలాపాలకు సైతం..

కాలనీ అభివృద్ధి కోసం ఎంతోకొంత వసూలు చేసి అద్దెకు ఇస్తే ఫర్వాలేదు. అలాకాకుండా కొంతమంది వ్యాపారులకు ఉచితంగా కమ్యూనిటీ హాళ్లను కట్టబెడుతూ ఆయా సంస్థలకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్కుకు సమీపంలో ఉన్న మరో కమ్యూనిటీహాల్‌లో కొన్ని నెలలగా ఏకంగా కౌంటర్ ఓపెన్ చేసి అక్కడికి వచ్చే కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి తమ దందా కొనసాగించారు. ప్రస్తుతం ఆ వ్యవహారానికి బ్రేక్ ఇచ్చినప్పటికీ ఎలాంటి రుసుం లేకుండా ఇవ్వడమనేది ఎవరికీ లబ్ధి చేకూర్చడానికో అర్థం కావట్లేదు. ఇక కొన్ని కమ్యూనిటీ హాళ్లలో అయితే కొన్ని సంస్థలకు ప్రమోషన్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చేస్తున్నాయి. వారి నుంచి డబ్బులు వ్యక్తిగతంగా పుచ్చుకుంటున్నారా..? లేక కాలనీ అసోసియేషన్‌కు ఉపయోగిస్తున్నారా..? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

అద్దె డబ్బు ఎటుపోతుంది..?

కమ్యూనిటీ హాళ్ల అద్దె డబ్బులు ఎటు పోతున్నాయని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు ఉచిత క్యాంప్‌ల పేరుతో కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు హాళ్లను ఉపయోగించుకునేందుకు అనుమతిస్తున్నారు. ఇదంతా అధికారికంగా జరుగుతుందా? లేక వ్యక్తిగతంగా లబ్ధి పొందుతున్నారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. హాళ్లను ఎంతమందికి కిరాయికి ఇచ్చారు.. ఎంత రుసుం వసూలు చేస్తున్నారు..? వాటిని ఎలా ఉపయోగిస్తున్నారు..? తదితర అంశాలపై జీహెచ్ఎంసీ పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది తమ సొంత భవనాల్లా ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు జీహెచ్ఎంసీలో ఏ విభాగం వీటి పర్యవేక్షణ చూస్తోందనేది చాలామందికి తెలియని పరిస్థితి. ఏదైనా ఫిర్యాదు వచ్చిందంటే యూసీడీ విభాగం మీదకు నెట్టేస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కమ్యూనిటీ హాళ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సన్మానం



విజేతలుగా నిలిచిన క్యాడెట్లతో కల్నల్ అనిల్ తదితరులు

రసూల్‌పురా: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో ఈ నెల 1 నుంచి 10 తేదీ వరకు నిర్వహించిన థల్ సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 51 మంది ఎన్‌సీసీ క్యాడెట్లను కంటోన్మెంట్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ ముఖ్య అతిథిగా హాజరై షూటింగ్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్‌క్రాఫ్ట్, హెల్త్ అండ్ హైజీన్, ఫిజికల్ ఫిట్‌నెస్ వివిధ కోర్సుల్లో విజేతలుగా నిలిచిన ఆంధ్ర, తెలంగాణకు చెందిన 9 గ్రూప్ టీంల క్యాడెట్లను సత్కరించారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ పోటీల కారణంగా క్యాడెట్లలో నాయకత్వ సామర్థ్యం, మానసిక ధృడత్వం పెంపొందుతుందన్నారు. సెప్టెంబర్ 2 నుంచి 13 వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్‌కు హైదరాబాద్ గ్రూప్ నుంచి 33 మంది క్యాడెట్లు ఎంపికవ్వవడం అభినందనీయమన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన లాన్స్ కార్పొరల్, అభిషేక్, క్యాడెట్లు మేఘన, అర్పిత్ యాదవ్, సాయికుమార్‌ను కాంస్య పతకాలు సాధించిన కార్పొరల్ తనుష్క, క్యాడెట్ సయ్యద్ వాసిఫ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఏఎన్‌వోలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



దర్నా చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎఫ్ పిలుపు మేరకు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ సెక్రటరీ రవీందర్ అధ్యక్షతన సికింద్రాబాద్‌లోని డీఆర్ఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యాలయం నుంచి కన్‌స్ట్రక్షన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం, హైదరాబాద్ డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణపై తీర్మానం చేయాలన్నారు. ఏజీఎస్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఐక్యంగా పోరాడితే కచ్చితంగా పాత పెన్షన్ విధానం సాధిస్తామని పేర్కొన్నారు. ధర్నాలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, కోశాధికారి సరోజిని రెడ్డి, జోనల్ ఏజీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, డివిజనల్ సెక్రటరీలు బుచ్చిరెడ్డి, కృష్ణ, వరప్రసాద్, ఖాజాబాబా, నవీన్, చిలుకస్వామి, నర్సింహా రెడ్డి, నాగలక్ష్మి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ గ్రూప్ తల్‌సేనా క్యాంపు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు ఛాంపియన్‌షిప్ సాధించారు. తెలంగాణ బెటాలియన్ నుంచి 15 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ అద్భుతమైన ప్రతిభ కనబరచగా ఇందులో అంబేడ్కర్ కళాశాల ఇంటర్ విద్యార్థి బి.వంశీసాగర్ హైదరాబాద్ జట్టు గెలవడానికి తన వంతు పాత్ర పోషించాడు. క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ప్రసున్నథ్ నాయకత్వంలో ఛాంపియన్‌గా గెలవడం సాధ్యమైందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల యాజమాన్యం తెలిపింది. లెఫ్టినెంట్ కర్నల్ ఎం.కిరణ్‌కుమార్, కళాశాల చైర్మన్ జి.వివేక్, కరస్పాండెంట్ జి.వినోద్‌లు, ఆర్మీ సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు. గెలుపొందిన వారిని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఎన్‌సీసీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

రసూల్‌పురా: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ అసిస్టెంట్ కమిషనర్ జి. శంకర్ రాజు అన్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయం సిబ్బందికి, 6- మద్రాస్ ఆర్మీ బెటాలియన్ సైనికులకు 'రోడ్డు ప్రమాదాలు-నివారణ అంశం'పై శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ. 5 వేల జరిమానా మూడు నెలల జైలుశిక్ష పడుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని సూచించారు. కల్నల్ అభిషేక సింగ్, 200 మంది ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ నిబంధనల ప్రకారం ఉద్యోగ విరమణ వయో పరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఓయూలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి వయో పరిమితి పెంచాలని, వర్సిటీల ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, యూజీసీ పెండింగ్ (ఆర్ఎస్‌పీ-2016) బకాయిలు చెల్లించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌటా అధ్యక్షుడు ప్రొ.మల్లేశం, ప్రధాన కార్యదర్శి ప్రొ.శ్రీనివాస్, డా.చల్లమల్ల వెంకటేశ్వర్లతో పాటు వివిధ వర్సిటీల ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిలతో వర్సిటీల దివాలా



అల్లూరి విజయ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఇన్‌చార్జి వీసీల పాలనలో వర్సిటీలు దివాలా తీశాయని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఓయూతో పాటు జేఎన్‌టీయూ, కాకతీయ, శాతావాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, తెలుగు వర్సిటీ, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయాలకు పర్మనెంట్ వైస్ చాన్స్‌లర్స్ లేకపోవడంతో అధ్యాపకుల కొరత, నిధుల సమస్యలతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి పైరవీలు, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పారదర్శకంగా వీసీలను నియమించాలని లేఖలో కోరినట్లు ఆయన తెలిపారు.

అనాథ బాలికల గృహంలో నేడు లైబ్రరీ ప్రారంభం



ఆకర్షణ

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆకర్షణ సతీశ్ లైబ్రరీల ఏర్పాటులో భాగంగా 14వ లైబ్రరీని సిద్ధం చేశారు. సికింద్రాబాద్ బోయిగూడలోని అనాథ బాలికల వసతి గృహంలో 400 పైచిలుకు పుస్తకాలతో ఏర్పాటు చేయగా శనివారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి డబ్ల్యూయూసీడీ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తన్నీరు ప్రమోద, యూనిసెఫ్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్‌రాజ్ తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శాకాంబరీగా మహంకాళి అమ్మవారు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా దర్శనమిచ్చారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జీసీసీడీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



ఉస్మానియా యూనివర్సిటీ: జీసీసీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డా.బెల్లయ్యకు ఓయూ టీబీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ నాయక్ శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీయులుగా మారిన తండాలకు మరిన్ని నిధులు కేటాయించి, గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరినట్లు విజయ్ నాయక్ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ప్రీతంను సన్మానించిన నీలిమ

అమీర్‌పేట: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నగరిగారి ప్రీతంను సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. అసెంబ్లీ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నిలీమ ప్రీతంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బోనాల వేడుకలను వైభవంగా నిర్వహిస్తాం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, మహేశ్వరితో కలిసి శుక్రవారం బోనాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని 256 ఆలయాలకు సంబంధించి రూ.1.69 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ, మాజీ కార్పొరేటర్లు కిరణ్మయి పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమాల్లో పార్టీ లీడర్లు

ఆలయాల చెక్కుల పంపిణీ కార్యక్రమం అధికారికంగా జరిగింది. అయితే ఈ కార్యక్రమంలో పార్టీ నుంచి సనత్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కోట నీలిమ వేదిక పైకి ఎక్కి చెక్కుల పంపిణీ చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీలు ఉండాల్సి ఉండగా ఇలా పార్టీలకు చెందిన వారు హల్‌చల్ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

డ్రగ్స్ వినియోగిస్తే చర్యలు



ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న రైల్వే పోలీస్ అధికారులు

చిలకలగూడ : డ్రగ్స్ వినియోగించిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) డీఎస్పీ భిక్షపతిరావు హెచ్చరించారు. జీఆర్‌పీ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్ గౌడ్ నేతృత్వంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నివారణకు యాంటినార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను వివరిస్తూ నినాదాలు చేస్తు, ఫ్లకార్డులు ప్రదర్శిస్తు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీజీఏఎన్‌బీ ఇన్‌స్పెక్టర్ సమ్యానాయక్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగార్జునరెడ్డి, పలు పోలీస్, రైల్వే విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

- జోనల్ కమిషనర్ రవికిరణ్
- సంబంధిత అధికారులతో సమావేశం



డెంగీ నివారణ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌సీ రవికిరణ్

చిలకలగూడ : డెంగీ వ్యాధి నియంత్రణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. దోమల నివారణ, డెంగీ నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై డిప్యూటీ కమిషనర్లు, శానిటేషన్, మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఈలు, ఎంటమాలజీ అధికారులతో శుక్రవారం తన కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ప్రజల సహాయ సహకారాలు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డెంగీ దోమలను నివారిస్తే, విషజ్వరాలు నియంత్రణలోకి వస్తాయన్నారు. అలాగే డెంగీ నియంత్రణ కార్యాచరణ ప్రణాళికను జెడ్‌సీ రవికిరణ్ వివరించారు.

- ప్రతి శుక్ర, శనివారాల్లో ఆయా పాఠశాలల్లో డెంగీ నియంత్రణపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు అవగాహన కల్పించాలి.
- బయోలజీ టీచర్లతో పాఠశాలల్లో ఎగ్జిబిషన్ నిర్వహించి దోమల వలన కలిగే వ్యాధులు, నివారణ, నియంత్రణ అంశాలను వివరించాలి.
- డెంగీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లేట్లెట్లు కౌంట్ తగ్గడం, దద్దుర్లు వంటి అంశాలపై అవగాహన కల్పించాలి.
- ప్రతి శుక్రవారం ఆయా కాలనీ, బస్తీ సభ్యులను భాగస్వాములను చేస్తూ, ఇంటింటికీ తిరుగుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి, ఇంటి సభ్యులతో వాటిని తొలగించి, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి.
- దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు మొబైల్, ఈ-మెయిల్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి.
- అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ టీంలీడర్‌గా వ్యవహరించి సీనియర్, జూనియర్ ఎంటమాలజిస్ట్‌ల సమన్వయంతో దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టి, అత్యంత కీలకంగా వ్యవహరించాలి.
- అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లతో పాటు డీసీ, ఏఎంఓహెచ్ఎస్, ఎస్ఈఎస్, ఏఈలతో అన్ని జోనల్ కార్యాలయాల్లో వారానికోసారి ప్రత్యేక సమావేశం నిర్వహించి సాధించిన ప్రగతిని వివరించాలి.
- డెంగీ కేసుల నియంత్రణకు డిప్యూటీ కమిషనర్, ఏఎంఒహెచ్‌లు సర్కిల్‌స్థాయిలో నాయకత్వం వహించాలి. ప్రతి బస్తీ దవాఖానలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి సబంధిత చార్ట్‌లను ప్రదర్శించాలి.
- డెంగీ కేసుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. వ్యాధిగ్రస్తుల ఇళ్లను సందర్శించి వారిలో నెలకొన్న భయాందోళనలను తొలగించి అవగాహన కల్పించాలి.
- డీసీలు, సీనియర్ ఎంటమాలజిస్ట్‌ల సమన్వయంతో ఫాగింగ్‌పై దృష్టి సారించాలి. హాట్ స్పాట్లు, డెంగీ సోకిన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలి. పాజిటివ్ కేసు నమోదైన ఇంటి నుంచి సుమారు 120 ఇళ్లవరకు ఇరువైపులా దోమల నివారణ రసాయనాలను పిచికారీ చేయాలి.
- కాలనీలు, బస్తీలో డెంగీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఇళ్ల గోడలపై స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు పంపిణీ చేయాలి. అన్ని జ్వరాలు డెంగీ కాదని ప్రజల్లో అవగాహన కల్పించాలి.
- ఏఎంఒహెచ్‌లు లార్విసైడ్స్, అడల్టిసైడ్స్ కలిపే విధానాన్ని తెలుసుకుని ఈ ప్రక్రియ ద్వారా లార్వా, దోమలు, వాటి నుంచి సంక్రమించే వ్యాధుల నివారణకు కృషి చేయాలని వివరించారు.

డెంగీపై అవగాహన

సనత్‌నగర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఖైరతాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ అన్నారు. సనత్‌నగర్‌లోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల, అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, రోజ్‌బడ్స్ పాఠశాలల్లో శుక్రవారం డెంగీపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ, ఎంటమాలజీ ఈఎఫ్ఏ ప్రభాకర్, ఎస్ఎఫ్ఏ అరవింద్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహనలో ఖైరతాబాద్ డీఎంసీ జగన్

బోనాల వేడుకల చెక్కు అందజేత



చెక్కు తీసుకుంటున్న బాపునగర్ వాసులు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్‌లోని బాపునగర్ దుర్గామాతా ఆలయానికి బోనాల వేడుకలకు సంబంధించి రూ.55 వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా శుక్రవారం ఎమ్మెల్యే తలసాని కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్, సభ్యులు గోపీలాల్‌చౌహన్, విక్రమ్‌సింగ్, సతీశ్ ఉన్నారు.